




# కరపత్రం

SINCE 2014

శుక్రవారం ఏప్రిల్ 04 2025 సంపుటి :0 సంచిక : - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4


## హైదరాబాద్‌లో వర్షం.. అధికారులను అప్రమత్తం చేసిన సీఎం రేవంత్



హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తున్న నేపథ్యంలో అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిలవకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కోరారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే వెంటనే పునరుద్ధరించాలని, ట్రాఫిక్ సమస్యను త్వరగా క్లియర్ చేయాలని అన్నారు. జిల్లాల్లోనూ అధికారులు, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటన

### బ్యాంకాక్ చేరుకున్న ప్రధాని మోడీ



ప్రధాని మోడీ బ్యాంకాక్ చేరుకున్నారు. అక్కడ ఘనస్వాగతం లభించింది. రెండు దేశాల పర్యటన కోసం గురువారం బయల్దేరి వెళ్లారు. గురువారం నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకలో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో దిగగానే మోడీకి ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ అధికారులతో పాటు భారతీయులు భారీ స్వాగతం పలికారు. తొలుత రెండు రోజుల పాటు థాయ్‌లాండ్‌లో మోడీ పర్యటించనున్నారు. థాయ్‌లాండ్‌లో 6వ బిమ్‌స్టెక్ శిఖరాగ్ర సమావేశంలో మోడీ పాల్గొనన్నారు. పర్యటనలో భాగంగా థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్‌టార్న్ షినవత్రాతో కూడా భేటీ అయి ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించనున్నారు. ఇక సాయంత్రం బిమ్‌స్టెక్ సదస్సులో మోడీ పాల్గొంటారు. ఈ సదస్సులో భారత్‌తో పాటు- థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్, మయన్మార్, భూటాన్ దేశాల అధినేతలు పాల్గొననున్నారు. ఇక ఈ సదస్సులో సాంకేతిక, ఆర్థిక సహకారంపై చర్చించనున్నారు.

## సుప్రీంకోర్టు ఆదేశాలను పాటిస్తాం: భట్టి విక్రమార్క

హైదరాబాద్: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటిస్తామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. న్యాయస్థానాలపై తమకు పూర్తి విశ్వాసం ఉందని.. న్యాయం తప్పకుండా గెలుస్తుందన్నారు. సుప్రీంకోర్టు అడిగిన సమాచారాన్ని గడువులోగా పంపిస్తామన్నారు. విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించవద్దని సైబరాబాద్ కమిషనర్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీని ఆదేశించినట్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.



## భారాస రజతోత్సవ వేళ.. పాట విడుదల చేసిన కేసీఆర్



హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ వేళ ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పాటను విడుదల చేశారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పాట రచించి పాడారు. 'బండెనుక బండి కట్టి... పోదాము రారన్నో..." అంటూ రసమయి బాలకిషన్ రాసి, పాడిన పాటను కేసీఆర్ ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటివరకు భారాస ప్రస్థానంపై పాటలు, కళారూపాలు రూపొందించాలని రసమయి బాలకిషన్‌కు కేసీఆర్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర నాయకులు పాల్గొన్నారు.

## హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టు తీర్పు.. ప్రభుత్వానికి చెంపదెబ్బ: రఘునందన్‌రావు



2 లో

## బిసి గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

అయినా కాంగ్రెస్ అగ్రనేత మద్దతు ఉంది
డిల్లీ బిసి గర్జాన సభపై పిసిసి చీఫ్



2 లో

# చల్లని కబురు..

## హైదరాబాద్‌లో పలు చోట్ల వర్షం

గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు.

హైదరాబాద్: గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న హైదరాబాద్ నగరవాసులను వరుణుడు పలకరించాడు. హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలో వర్షం కురిసింది. దీంతో నగర వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. హిమయత్‌నగర్, కోఠి, అమీర్‌పేట, బోరబండ, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్, హయత్‌నగర్, మేడ్చల్, విద్యానగర్, కోఠి, అబిడ్స్ తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయ్యింది. ఖైరతాబాద్‌లోని మెర్క్యురీ హోటల్ వద్ద ఓ కారుపై చెట్టు కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు సురక్షితంగా బయటపడ్డారు.

### పలు ప్రాంతాలు జలమయం

అకాల వర్షంతో హైదరాబాద్ మహానగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాష్ట్ర సచివాలయం ముందుభాగం చెరువును తలపిస్తోంది. ఛార్మినార్‌లోని ఓ మీనార్‌పై నుంచి కొంత మట్టి కిందపడింది. ఈ ఘటనలో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. వివిధ చోట్ల రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలక్‌పేట వంతెన వద్ద వరదనీరు



నిలిచిపోయింది. రాజ్‌భవన్ రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. తెలుగుతల్లి ఫ్లైఓవర్ కింద భారీగా నీరు చేరింది. పలుచోట్లు చెట్లు కూలిపోయాయి. స్తంభాలు ఒరిగిపోయాయి. ఖైరతాబాద్- పంజాగుట్ట మధ్య వాహనాల రాకపోకు నిలిచిపోయాయి.

## సంపాదకీయం

# ఎన్‌జేఏసీ పునరుద్ధరణ డిమాండ్ సరైనదేనా?

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో నోట్ల కట్టల సంచులు బయటపడడంతో న్యాయవ్యవస్థ భ్రష్టుపట్టిపోతున్నదనే ఆందోళన అంతటా వ్యక్తమైంది. ఈ ఉదంతంపై సుప్రీంకోర్టు నియమించిన ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ పరిణామాన్ని ఆసరా చేసుకుని ఉన్నత న్యాయమూర్తుల నియామకాలపై పార్లమెంటు నెలకొల్పిన ఎన్‌జేఏసీ జాతీయ న్యాయ నియామకాల కమిషన్‌ను 2015లో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయకుండా ఉంటే బాగుండేదని ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వ్యాఖ్యానించారు. ఈయన, అప్పటి న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు కలిసి కొలీజియం పైన, న్యాయమూర్తుల నియామకాల్లో సుప్రీంకోర్టు పెత్తనం మీద తరచూ విరుచుకుపడుతూ ఉండేవారు. అందులో గౌరవహీన పదజాలాన్ని కూడా ఉపయోగించేవారు. కొందరు రిటైర్డ్ జడ్జీలు ఇండియా వ్యతిరేక గ్యాంగ్‌గా కూడి భారత న్యాయవ్యవస్థ ప్రతిపక్షంగా వ్యవహరించేలా చేయడానికి ప్రయత్నిస్తున్నారని కూడా రిజిజు అన్నారు. కేంద్రన్యాయ శాఖ మంత్రి ఒకరు న్యాయవ్యవస్థ మీదకు ఇంతటి సూది మొన రాయిని విసరడం ఎప్పుడూ చూడలేదు. న్యాయవ్యవస్థపై రిజిజు ప్రేలాపనలు జుగుప్సాకరంగా ఉండడంతో ఆయనను ఆ శాఖ నుంచి తప్పించారు. జగదీప్ ధన్‌ఖడ్ అయితే వీలైనప్పుడల్లా న్యాయవ్యవస్థ కంటే పార్లమెంటు ఉన్నతమైనదని అంటూ, పార్లమెంటు రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకొచ్చిన ఎన్‌జేఏసీని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేయడాన్ని ఇప్పటికీ తప్పుపడుతున్నారు.ఎన్‌జేఏసీ బిల్లుకు 2014లో ప్రధాని మోదీ ప్రభుత్వం పార్లమెంటు ఆమోదం పొందింది. రాజ్యాంగంలో 124ఎ(3) అనే కొత్త సెక్షన్ చేర్చడం ద్వారా ఈ బిల్లును పార్లమెంటు చట్టంగా చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) కూడా ఉండే ఆరుగురు సభ్యుల కమిటీని ఉన్నత న్యాయమూర్తుల నియామకం కోసం ఈ చట్టం అవతరించింది. అయితే ఇద్దరు బయటి ప్రముఖులను కూడా ఈ కమిటీలో చేర్చడం వివాదాస్పదమయింది. న్యాయమూర్తుల నియామకంలో న్యాయ వ్యవస్థ పాత్రను నామమాత్రం చేస్తున్నదనే కారణంపై ఎన్‌జేఏసీ చట్టాన్ని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీం కోర్టు ధర్మాసనం 4:1 మెజారిటీ తీర్పుతో 2015 అక్టోబర్ 6న రద్దు చేసింది.రాష్ట్రపతి సీజేఐని సంప్రదించి ఉన్నత న్యాయమూర్తులను నియమించాలని రాజ్యాంగ అధికరణ 124(2) స్పష్టం చేస్తున్నది. ఎన్‌జేఏసీలో ఇందుకు బొత్తిగా సందు లేకుండా చేశారు. సీజేఐని సంప్రదించడమంటే కేవలం వారికి తెలియజేయడం కాదని, వారి సమ్మతిని తీసుకోవడం కిందికి వస్తుందనే నిర్వచనం వెల్లడయింది. జస్టిస్ వర్మ ఇంటిలో నోట్ల కట్టల ఉదంతాన్ని సాకుగా చేసుకొని వెనువెంటనే ఉపరాష్ట్రపతి ఎన్‌జేఏసీ ప్రస్తావన తేవడం సమంజసంగా లేదు. నోట్ల కట్టల ఘటనపై రాజ్యసభలోని వివిధ పార్టీల సభా నేతలతో సమావేశానికి ముందే ధన్‌ఖడ్ ఎన్‌జేఏసీ ప్రస్తావన చేయడం ఆయన బీజేపీ పక్షపాతాన్నే చాటింది. అరుదుగా ఏ స్థాయిలోని వ్యక్తి అయినా అవినీతికి, ఆశ్రిత పక్షపాతానికి పాల్పడే అవకాశం లేకపోలేదు. దేశంలో ఇటువంటివి మామూలు అయిపోలేదు గాని ప్రముఖులను అప్రతిష్ఠపాలు చేసిన ఘటనలు జరగకపోలేదు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 1971 మే లో ఆమె, ఆమె సెక్రటరీ పి.ఎన్. హక్సర్ స్వయంగా ఫోన్లో ఆదేశించారనుకుని ఢిల్లీ పార్లమెంటు స్ట్రీట్ స్టేట్ బ్యాంకు చీఫ్ క్యాషియర్ వి.పి. మల్హోత్రా బ్యాంకు నగదు నుంచి 60 లక్షల రూపాయల కట్టలు తీసి రుస్తుం సోహ్రాబ్ నగర్వాలా అనే ఆయనకు ఇచ్చాడు. ఆ మొత్తానికి చెక్కు కోసం ప్రధాని ఇంటికి వెళ్లి ఆయన భంగపడడం, పోలీసులు దర్యాప్తు చేసి నగర్వాలా నుంచి 6 వేల రూపాయలు మినహా మిగతా బ్యాంకు సొమ్మును వసూలు చేయడం సంచలనం సృష్టించింది,ప్రధాని మోదీ స్వయంగా ఆదానీ వాణిజ్య ప్రయోజనాలకు తోడ్పడుతూ ఆయనకు ఉక్కు కవచంలా ఉపయోగపడుతున్నారనే విమర్శ తెలిసిందే. దీనిలోని నిజానిజాలను ఆయన పార్లమెంటుకు తెలియజేయాలన్న డిమాండు నిష్ఫలం అయిపోయిన సంగతీ ఎరుకే. కింది స్థాయి న్యాయ వ్యవస్థలో ఒకటీ అరా అప్రతిష్ఠాకర ఘటనలు చోటుచేసున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో బెయిల్ మంజూరుకు లంచం తీసుకుని నగుబాటై ఆత్మహత్యకు పాల్పడిన మేజిస్ట్రేట్ ఉదంతం జ్ఞాపకాల తెర మీదినుంచి ఇంకా తొలగిపోలేదు. అతిజుగుప్సాకరమైన గుజరాత్ మారణహోమ దోషులను ఆ రాష్ట్ర ప్రభుత్వమే ముందస్తుగా విడుదల చేయడం, వారికి బయట బ్రహ్మాండమైన స్వాగతం లభించడం తెలిసిందే.వ్యక్తులు సమష్టి మేలు కోసం ఏర్పరచుకున్నవే వ్యవస్థలు. అందులోని మెజారిటీ సభ్యులు గాని, వాటి నిష్పాక్షికతను కాపాడవలసిన వాటి పాలకులు గాని స్వార్థం కోసం వాటిని బలి తీసుకోనంతకాలం అవి వాటి విధిని సవ్యంగా నిర్వర్తిస్తూనే ఉంటాయి. ఆందోళన చెందవలసిన పని లేదు. దేశ రాజ్యాంగం పైన బొత్తిగా గౌరవం లేని కాషాయ పాలకుల హయాంలో ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మలైన స్వతంత్ర సంస్థల వెన్నెముకలు విరిగిపోయాయన్న అభిప్రాయం గట్టిపడింది. ముఖ్య నిర్ణయాలు తీసుకునే పదవుల్లోనివారు రిటైర్ అయిన తర్వాత ప్రభుత్వం ఇచ్చే నజరానాలకు ఆశపడకుండా ఉండడం ఒకప్పటి నీతిగా ఉండేది. ఇప్పుడా నీతి ఊరూ పేరూ లేకుండా కొట్టుకుపోయింది.ఇక్కడ ఒక తాజా వార్తను ప్రస్తావించుకోవాలి. సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలతో సహా ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అనేకమంది మీద మనీ లాండరింగ్ వ్యతిరేక కేసులు బిగించి వేధించిన చరిత్ర కలిగి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేసిన సంజయ్ కుమార్ మిశ్రా (65)ను ప్రభుత్వ కార్యదర్శి హోదాలో ప్రధాని ఆర్థిక సలహా మండలి పూర్తికాల సభ్యునిగా ఇటీవలే నియమించారు. ఈడీగా ఈయన పదవీ కాలాన్ని అనేకసార్లు పొడిగించారు. 2018లో పదవీస్వీకారం చేసిన మిశ్రా పదవీ కాలాన్ని అదే పనిగా పొడిగిస్తూ పోవడాన్ని ప్రతిపక్షాలు సవాలు చేస్తూ వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పదవీ కాలాన్ని ఇంకా పొడిగించడానికి సుప్రీంకోర్టు అనుమతించకపోవడంతో 2023 సెప్టెంబర్‌లో మిశ్రా ఆ పదవి నుంచి తప్పుకోక తప్పలేదు. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని లేకుండా చేసి కేంద్ర ఎన్నికల సంఘం చేత మోదీ ప్రభుత్వం ఊడిగం చేయించుకుంటున్నదనే విమర్శ తెలిసిందే. అత్యంత ముఖ్యమైన అయోధ్య వివాదం విచారణకు, రాఫెల్ యుద్ధ విమానాల కేసుకు సారథ్యం వహించి తీర్పులు ప్రకటించిన సీజేఐ రంజన్ గొగోయ్ పదవీ విరమణ చేసిన వెంటనే రాజ్యసభ సభ్యులయ్యారు. రంజన్ లైంగికంగా వేధించారని సుప్రీంకోర్టులో పని చేసిన ఒక మహిళ ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన కేసు విచారణను తిన్నగా నడవనీయకుండా చేసి గొగోయి అందులో నుంచి బయటపడ్డారని అనుకున్నారు.

# ట్రంప్ టారిఫ్ బాంబ్.. భారత్‌లో ఈ రంగాలపై ఎఫెక్ట్



అంచనాలను మించి భారత్‌పై టారిఫ్‌ల బాంబు వేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. న్యూఢిల్లీ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. సుంకాల మోత మోగించారు. అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు తెలిపారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు వెల్లడించారు. అయితే, ట్రంప్ నిర్ణయంతో మన దేశంలోకి కొన్ని రంగాలపై కీలక ప్రభావం పడనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ అనుబంధ, ఫార్మా ఉత్పత్తులపై ఎఫెక్ట్ ఉండనున్నట్లు పేర్కొంటున్నారు. మరి ఆ రంగాలు ఏంటంటే..?

**వ్యవసాయం, డెయిరీ, సీఫుడ్..**

గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ విశ్లేషణ ప్రకారం.. ట్రంప్ టారిఫ్‌ల వల్ల వ్యవసాయ రంగ సంబంధిత ఎగుమతులపై అత్యధిక ప్రభావం ఉండనున్నట్లు తెలుస్తోంది. భారత రొయ్యలు, ఇతర సీఫుడ్ ఉత్పత్తులకు యూఎస్ ప్రధాన దిగుమతిదారుగా ఉంది. 2024లో అమెరికాకు చేపలు, ఇతర ప్రాసెస్డ్ సీఫుడ్ ఎగుమతుల విలువ 2.58 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇప్పుడు తాజా సుంకాల వల్ల అగ్రరాజ్య మార్కెట్లో వీటి ధరలు పెరుగుతాయి. దీంతో గిరాకీ ఆశించిన మేర ఉండకపోవచ్చని నిపుణుల అభిప్రాయం.
రంగాల వారీగా ఉత్పత్తులపై సుంకాలు భిన్నంగా ఉంటాయి. ట్రంప్ తాజా నిర్ణయంతో మన డెయిరీ ఉత్పత్తులపై టారిఫ్‌లు 38.23 శాతానికి చేరనున్నాయి. దీంతో అగ్రరాజ్యంలో మన వెన్న, నెయ్యి, పాలపొడి ధరలు కూడా పెరుగుతాయి. భారత్ నుంచి అమెరికాకు 181.49 మిలియన్ డాలర్ల డెయిరీ ఎగుమతులు జరుగుతున్నాయి. దీంతో పాటు ప్రాసెస్డ్ ఫుడ్, చక్కెర, కోకో ఎగుమతులపై ప్రభావం పడనుంది.

**టెక్స్‌టైల్స్, బంగారం..**

భారత్ నుంచి ఏటా 11.88 బిలియన్ డాలర్ల విలువైన బంగారం, వెండి, వజ్రాభరణాలు అగ్రరాజ్యానికి ఎగుమతి అవుతున్నాయి. తాజా పెంపుతో వీటిపై సుంకం 13.32 శాతానికి చేరనుంది. దీంతో అమెరికాలో ఆభరణాల ధరలు పెరగనున్నాయి. ఇక, జౌళి పరిశ్రమ పైనా అధిక ప్రభావమే పడనుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి 9.6 బిలియన్ డాలర్ల విలువైన దుస్తులు, ఇతర టెక్స్‌టైల్ ఫ్యాబ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మనం చేసే మొత్తం టెక్స్‌టైల్ ఎగుమతుల్లో 28 శాతం అమెరికాకే వెళుతున్నాయి.

**చెప్పులపైనా..**

పాదరక్షల పరిశ్రమ పైనా సుంకాల ప్రభావం ఉండనుంది. మన దేశం నుంచి 457.66 మిలియన్ డాలర్ల విలువైన ఫుట్‌వేర్ ఉత్పత్తులు యూఎస్‌కు ఎగమతి అవుతున్నాయి. వీటిపై అమెరికా-భారత్ మధ్య సుంకాల వ్యత్యాసం 15.56 శాతంగా ఉంది. దీంతో అగ్రరాజ్య మార్కెట్లో మన చెప్పుల ధరలు మరింత ప్రియం కానున్నాయి. దీంతో కస్టమర్లు ఇతర దేశాల ఉత్పత్తులను ప్రత్యామ్నాయంగా ఎంచుకునే అవకాశం ఉంది.

**ఎలక్ట్రానిక్స్..**

ఎలక్ట్రానిక్స్, టెలికాం రంగాన్ని చూస్తే.. 2024లో 14.39 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులు మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యాయి. ఇప్పుడు సుంకాల పెంపుతో యూఎస్ మార్కెట్‌లో భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. ఇక, బాయిలర్లు, టర్బైన్స్, కంప్యూటర్ల వంటి ధరలు కూడా ప్రియమవుతాయి.

# ట్రంప్ సుంకాలు.. ఏం చేయాలనుకుంటున్నారు..?: రాహుల్ గాంధీ



అమెరికా సుంకాల అంశాన్ని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ లేవనెత్తారు.
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ దిగుమతులపై సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. ఈ టారిఫ్ లపై కేంద్ర ప్రభుత్వం స్పందన తెలియజేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభలో మాట్లాడిన రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధించిన సుంకాలు మన ఆర్థిక వ్యవస్థను పూర్తిగా నాశనం చేస్తాయన్నారు. దీనిపై కేంద్రప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా భారత్-చైనా వివాదాన్ని ఆయన ప్రస్తావిస్తూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. 'చైనా భారత్‌కు చెందిన 4 వేల కి.మీ. పైగా భూభాగాన్ని ఆక్రమించింది. దీనిపై ప్రధాని మోదీ , రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బీజింగ్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. అక్కడి రాయబారి ద్వారా ఈ విషయం బయటపడింది. దాన్ని తిరిగి తీసుకోవాలి' అని రాహుల్ పేర్కొన్నారు.

**వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగంపై దాడి: సోనియాగాంధీ**

ఇక, రాహుల్ వ్యాఖ్యలకు భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ గట్టిగా బదులిచ్చారు. ఎవరి హయాంలో చైనా ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకుందో అందరికీ తెలుసన్నారు. డోక్లాపై ప్రతిష్ఠంభన జరుగుతున్న సమయంలో బీజింగ్ అధికారులతో కలిసి సూప్ ఎవరు తాగారో తెలుసని రాహుల్‌పై విమర్శలు చేశారు. ఇలాంటి అంశంపై రాజకీయాలు చేయడం వల్ల ఏ ఫలితం ఉండదన్నారు. గతంలో జరిగిన తప్పిదాలకు వారే (కాంగ్రెస్‌ను ఉద్దేశిస్తూ) సమాధానం చెప్పాలన్నారు.
అమెరికా ఉత్పత్తులపై ఇతర దేశాలు విధిస్తున్న టారిఫ్‌లతో పోలిస్తే.. తాము సగం మేర మాత్రమే వసూలు చేయనున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో భారత్ తమకు వాణిజ్య భాగస్వామి అని చెబుతూనే.. ట్రంప్ సుంకాల బాంబు వేశారు. భారత్ తమ ఉత్పత్తులపై సగటున 52% సుంకం విధిస్తున్నందున, తాము 27% సుంకం విధిస్తున్నట్లు ట్రంప్ వెల్లడించారు.

# అనురాగ్ ఠాకూర్ ఆరోపణలు.. పుష్ప డైలాగ్‌తో కౌంటర్ ఇచ్చిన ఖర్గే

దిల్లీ: రాజ్యసభలో గురువారం ఓ ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. వక్ఫ్ భూమిని కబ్జా చేశారంటూ భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మండిపడ్డారు. తనపై అసత్య ఆరోపణలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నేత.. రాజకీయ దాడులకు తాను బెదిరిపోనని పేర్కొంటూ పుష్ప సినిమాలోని తగ్గేదేలే డైలాగ్ చెప్పారు. అసలేం జరిగిందంటే..వక్ఫ్ బిల్లు పై లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా భాజపా నేత అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఖర్గేపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆస్తులను కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు బాధ్యతారహితంగా వినియోగిస్తున్నాయని ఆరోపించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఆ భూములను కబ్జా చేశారంటూ ఖర్గేపై ఆరోపణలు చేశారు. దీనిపై కాంగ్రెస్ నేతలు తీవ్రంగా మండిపడ్డారు.ఆ 25వేల టీచర్ల నియామకాలు చెల్లవు.. దీదీ సర్కారుకు సుప్రీం షాక్ ఈనేపథ్యంలో గురువారం రాజ్యసభలో జీరో అవర్‌లో మాట్లాడుతూ ఖర్గే ఈ విషయాన్ని లేవనెత్తారు. "భాజపా ఎంపీ అనురాగ్ ఠాకూర్ నిన్న నాపై అసత్య, నిరాధార ఆరోపణలు చేశారు. మా పార్టీ ఎంపీలు ప్రశ్నించడంతో ఆ వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకున్నారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. సామాజిక మాధ్యమాలు, మీడియాల్లో భాజపా ఎంపీ చేసిన ఆరోపణలే వైరల్ అవుతున్నాయి. అందువల్లే ఈ రోజు నేను నిలబడి ఆయన ఆరోపణలను ఖండించాల్సి వస్తోంది. ఆయన వ్యాఖ్యలకు గానూ సభాపక్ష నేత క్షమాపణలు చెప్పాలి" అని ఖర్గే డిమాండ్ చేశారు."నా జీవితం తెరిచిన పుస్తకం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా. అయినప్పటికీ ప్రజా జీవితంలో తలెత్తుకొని నిలబడ్డా. అలాంటి నాపై అసత్య ప్రచారం చేస్తున్నారు. ఈ ఆరోపణలను ఠాకూర్ నిరూపించగలరా? ఒకవేళ అలా చేస్తే నేను రాజీనామా చేస్తా. లేదంటే ఆయనకు పార్లమెంట్‌లో ఉండే అర్హత లేదు. రాజీనామా చేయాల్సిందే. ఇలాంటి రాజకీయ దాడులతో భాజపా నేతలు నన్ను భయపెట్టాలని చూస్తున్నారు. గుర్తుంచుకోండి. నేను ఎవరికీ భయపడను. తలొగ్గను" అని ఖర్గే అన్నారు.

# హెచ్‌సీయూ భూములపై సుప్రీంకోర్టు తీర్పు.. ప్రభుత్వానికి చెంపదెబ్బ: రఘునందన్‌రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: హెచ్‌సీయూ భూముల విషయంలో విద్యార్థులకు భాజపా అండగా ఉంటుందని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. హైదరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ తీరుపై హెచ్‌సీయూ విద్యార్థుల పోరాట ఫలితంగానే కోర్టు తీర్పు వచ్చిందన్నారు.
"యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం మేం కూడా పోరాడతాం. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం నడుచుకోవాలి. ప్రభుత్వ అనుమతి లేకుండా చెట్లు కొట్టవద్దని వాల్టా చట్టం చెబుతోంది. ఒక్క చెట్టు కొట్టడానికే అనుమతి అవసరమైతే.. వందల చెట్లు ఎలా కొట్టారు? మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరని అనుకున్న ప్రభుత్వానికి సుప్రీం తీర్పు చెంపదెబ్బ వంటిది" అని రఘునందన్ పేర్కొన్నారు.

# బిసి గర్జనకు రాహుల్ వస్తాడని చెప్పలేదు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాజకీయాల్లో కీలకంగా మారిన బీసీ రిజర్వేషన్లపై టీపీసీసీ నేత మహేష్ గౌడ్ స్పందించారు. రాహుల్ గాంధీ బీసీ గర్జనకు హాజరవుతారని కాంగ్రెస్ ఎప్పుడు ప్రకటించ లేదని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లుతో సంబంధం ఉన్న అంశాల కారణంగా రాహుల్ గాంధీ ఈ కార్యక్రమానికి రాలేకపోయారని తెలిపారు. అయితే, బీసీ రిజర్వేషన్ల అంశంపై రాహుల్ గాంధీ పూర్తి మద్దతు ఇస్తారని హామీ ఇచ్చారు. అలాగే హైదరాబాదులోని సెంట్రల్ వర్సిటీ భూములపై ఇటీవల జరుగుతున్న చర్చ పై కూడా ఆయన స్పందించారు. ఐఈ÷ఖ భూములు ప్రభుత్వానికి చెందినవేనని, ఇది కోర్టు పరిధిలో ఉన్న అంశమని ఆయన తెలిపారు. విద్యాసంస్థల అవసరాల కోసమే ఈ భూములను వినియోగించుకుంటామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో జరిగిన భూ అక్రమాలపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అవి నిరూపించగలమని మహేష్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ భూములు అక్రమంగా ఆక్రమణకు గురైన వాటిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు హైడ్రా తీసుకువచ్చామని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ అడ్డుపడుతున్నాయని మహేష్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటు-న్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రెండు పార్టీలే ప్రధాన అడ్డంకిగా మారుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ భూముల నుంచే మై హోమ్‌కు వంద అడుగుల రోడ్డు అనుమతి ఎలా ఇచ్చారని మహేష్ గౌడ్ ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే ఎలా జరిగిందో తమకు అనుమానం ఉందని, దానిపై విచారణ జరిపిస్తామని ప్రకటించారు. మూడేళ్లలో మేము అధికారంలోకి వస్తామని కేటీ-ఆర్ పగటి కలలు కంటు-న్నాడు అంటూ మహేష్ గౌడ్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్నదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమకు తిరిగి అవకాశం కల్పిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. అయితే ప్రస్తుతం జరగాల్సిన మంత్రివర్గ విస్తరణలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

# భారాస ఐటీ సెల్‌పై కేసు నమోదు




హైదరాబాద్: నకిలీ వీడియోలు వైరల్ చేశారన్న ఆరోపణలపై భారాస ఐటీ సెల్‌పై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. భారాస సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ దిలీప్, క్రిశాంక్‌పై 353, 1(సీ), 353(2), 192, 196(1), 61(1)(ఏ) బీఎన్ఎస్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే వీడియోలు సృష్టించి వైరల్ చేశారని అభియోగం మోపారు. వీడియోలు ఎడిట్ చేసి ప్రజల్లో అశాంతి రేపేలా, రెచ్చగొట్టేలా ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌లో వైరల్ చేసినట్లు పోలీసులు గుర్తించారు.

# హెచ్‌సీయూలో సంబురాలు.. సుప్రీంకోర్టు తీర్పుపై విద్యార్థుల హర్షం..



హైదరాబాద్ : కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ చర్యలు అన్నీ నిలిపివేయాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూలో విద్యార్థులు సంబురాలు నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పుతోనైనా రేవంత్ రెడ్డి దుందుడుకు చర్యలు విరమించుకోవాలని విద్యార్థులు సూచించారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకునేందుకు పోరాటం కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. భూముల్లో ప్రభుత్వ చర్యలన్నీ తక్షణం ఆపేయాలని ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు రిజిస్ట్రార్ పంపిన మధ్యంతర నివేదికను సుప్రీంకోర్టు పరిశీలించింది. వార్తా కథనాలను జస్టిస్ గవాయ్ ముందు అమికస్ క్యూరీ మెన్షన్ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ప్రతివాదిగా చేర్చింది కోర్టు. హైకోర్టు రిజిస్ట్రార్ నివేదిక ఫొటోలు చూస్తే పరిస్థితి అర్థమవుతుందన్నారు. వందల యంత్రాలు మోహరించాల్సిన అవసరమేంటని జస్టిస్ గవాయ్ ప్రశ్నించారు. అత్యవసరంగా కార్యకలాపాలు చేపట్టాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇది చాలా తీవ్రమైన అంశం అని కోర్టు పేర్కొంది. 3 రోజుల్లో 100 ఎకరాల్లో చెట్లు కొట్టివేత చిన్న విషయం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. చెట్ల కొట్టివేతకు అనుమతి తీసుకున్నారా..? అని కోర్టు ప్రశ్నించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఒక్క చెట్టు కూడా నరికివేయొద్దని కోర్టు ఆదేశించింది. అఫిడవిట్ దాఖలు చేయాలని సీఎస్‌ను కోర్టు ఆదేశించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఎలాంటి చర్యలు చేపట్టొద్దని కోర్టు ఆదేశించింది. ప్రభుత్వం మార్చి 15న వేసిన కమిటీ అధికారులూ జవాబు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఉల్లంఘనలు జరిగితే సీఎస్ వ్యక్తిగత బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

# అందరి భవిష్యత్తు కోసం జై బాపు,జై భీమ్,జై సంవిధాన్..

**కరపత్రం ప్రతినిధి ఇల్లంతకుంట ఏప్రిల్ 3**

కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలో హుజురాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ దిశా నిర్దేశంతో ఇల్లందకుంట మండల పార్టీ అధ్యక్షులు పెద్ది కుమార్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర కార్యక్రమం కనగర్తి మరియు లక్ష్మాజిపల్లి గ్రామాల్లో నిర్వహించడం జరిగింది.దేశ వ్యాప్తంగా చేస్తున్న ఈకార్యక్రమంలో భాగంగా ఇల్లందకుంట మండలం కనగర్తి గ్రామం నుంచి లక్ష్మాజీపల్లి గ్రామం వరకు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర చేపట్టడం జరిగింది.మొదట అంబేద్కర్ , గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని గ్రామస్తులందరితో ప్రతిజ్ఞ చేయడం జరిగింది.నాయకులు మాట్లాడుతూ అహింసా పద్ధతిలో పోరాటం చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్రం సిద్ధింపచేసిన మహాత్మా గాంధీతో పాటు ప్రజల స్వేచ్ఛ సమానత్వం కోసం రాజ్యాంగం రచించిన అంబేద్కర్ లను బిజెపి ఆర్ఎస్ఎస్ అవమాన పరుస్తున్నాయని మండిపడ్డారు.పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అంబేద్కర్ కు



వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం అన్నారు.. మహనీయుల ఆశయాలను కాపాడటంతో పాటు ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కాంగ్రెస్ అగ్రనేత లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపు,జై భీమ్,జై సంవిధాన్ అభియాన్ ర్యాలీ నిర్వహిస్తుందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడడానికి ప్రజల హక్కులను పరిరక్షించడానికి దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు గ్రామాలలో సామాజిక న్యాయం ఐక్యత కల్పించే ప్రధాన ఉద్దేశంతో రాజ్యాంగ పరిరక్షణ రాష్ట్రీయ పాదయాత్ర చేస్తున్నామని అన్నారు. ఈ పాదయాత్ర




ద్వారా రాజ్యాంగ గొప్పతనాన్ని ప్రజలకి తెలియజేయడంతో పాటు మహనీయులను స్మరించేందుకు వారు చేసిన సేవలోను నేటి తరానికి తెలియజేయపరిచే ఉద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెపు సారంగపాణి, తెలంగాణ ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, గ్రామ శాఖ అధ్యక్షులు మిట్ట మోహన్ రావు, బండి మల్లయ్య, మట్ట రాజు, రామంచ రాజు, మల్లేష్, శ్రీనివాస్ రెడ్డి,ఓదెలు, వీరారెడ్డి, రాజు, వెంకటేష్, మల్లారెడ్డి, రజిత, మానస, రవి,సాయి, మహేష్, సదానందం, స్వామి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఒలంపియాడ్ లో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు




**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ఆర్.ఎఫ్.సి.ఎల్ టౌన్షిప్ లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ఐ.ఎన్.టి.ఎస్.ఓ లెవెల్-2 పరీక్షకు మొత్తం 101 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో ఎం.టి.ఎస్.ఓ 29 మంది, ఎన్.టి.ఎస్.ఓ 10 మంది, జి.టి.ఎస్.ఓ 19 మంది, ఈ.టి.ఎస్.ఓ 31 మంది, ఏ.టి.ఎస్.ఓ 11మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో గ్రాండ్ ప్రైస్ సృష్టి భద్ర, రెండవ బహుమతి దర్శిల్, మూడో బహుమతులు ఆధ్యాహుతి, కళ్యాణ్ వసంత్, నాలుగవ బహుమతి మనస్వి, సంకీర్తన, నాగరిషత్ మరియు ఐదవ బహుమతి అద్వితీయ సాధించగా ప్రైమరీ విభాగంలో త్రుష్ణ మొదటి బహుమతి జి.టి.ఎస్.ఓ, సుదాన్షు తృతీయ బహుమతి జీ.టి.ఎస్.ఓ, శృహన్ పటేల్ ద్వితీయ బహుమతి ఎస్.టి.ఎస్.ఓ విభాగం, నక్ష్ ఐదవ బహుమతి ఎస్.టి.ఎస్.ఓ విభాగంలో సాధించారు. అద్భుత ప్రతిభ కనబరిచినందుకుగాను ప్రిన్సిపల్ రవి, డీన్ రమేష్, ఏ.వో నరేంద్ర కుమార్, సి-బ్యాచ్ బాధ్యులు ప్రశాంతి, రాజ్ కుమార్, అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

# చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు..

- రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేకంగా నిఘా....
- మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తాం.. పిడి యాక్ట్ అమలు చేస్తాం
- పెద్దపల్లి డీసీపీ కరుణాకర్

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

రౌడీ షీటర్లు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవనీ పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ హెచ్చరించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు కోసం రామగుండం పోలీస్ కమీషనర్ ఆదేశాలు మేరకు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు. డీసీపీ రౌడీషీటర్ల నేర చరిత్ర, వారిపై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఈరోజు నుండి రౌడీ షీటర్స్ ఉన్న వారి పేర్లు గాని,



మొహాలు గాని ఎలాంటి కేసులోనైనా, గ్రూపు తగాదాలలో ఐనా ఎవరి ప్రోద్బలంతో, ప్రభలంతోనైనా, ఎవరైనా ఫోన్లు లలో చెప్పడం వలన గాని నేరాలలో పాలుపంచుకోకూడదు ఈరోజు కౌన్సిలింగ్ హాజరైన వారిలో ఎవరైనా భవిష్యత్తులో నేరాలలో పాలుపంచుకుంటే చట్టంలో ఉన్న ఆక్ట్ ల ప్రకారం శాశ్వతంగా జైలు జీవితం గడప వలసి వస్తుందని డిసిపి హెచ్చరించారు. కౌన్సెలింగ్ నిర్వహించడానికి ప్రధాన కారణం మీ నేర ప్రవృత్తిని విడిచి కుటుంబ సభ్యులతో కలిసి మంచి జీవన ఉపాధి ఏర్పరచుకొని సత్ప్రవర్తనడం మెలగాలని అన్నారు. చెడు బుద్ధితో కొంతమంది చెప్పిన మాటలు విని,నమ్మి చట్ట వ్యతిరేకమైన కార్యకాలపాలు పాల్పడితే జైలు పాలు అవడం తప్పదన్నారు. హత్య నేరాలకు పాల్పడిన కేసులలో నిందితులకు జీవిత ఖైదు పడే విధంగా కృషి చేయాలని అధికారులు ఆదేశించారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని డీసీపీ అన్నారు. ఈ సందర్భంగా చాలా కాలం నుండి రౌడీషీటు ఓపెన్ అయి ఉండి గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాల్లో పాల్గొనకుండా సత్ప్రవర్తన కలిగి ఉన్న వ్యక్తులను గుర్తించి వారి రౌడీషీట్లను తీసేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి మడత రమేష్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి రవీందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వృద్ధ మహిళకు ఆర్థిక సాయం అందించిన కనకం కుటుంబం



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల్ చీమల పేట గ్రామంలో కళ్ళు లేని వృద్ధ మహిళ కనకం బక్కవ్వకు కనకం మహా కుటుంబం సంక్షేమ సంఘం తరపున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని కనకం కుటుంబం వ్యవస్థాపక అధ్యక్షులు కనకం రమణయ్య, కనకం విజయ్ నర్సాపూర్, కనకం తిరుపతి తేలు కుంట అందజేశారు. 80 సంవత్సరాల కనకంబక్కవ్వ కు కంటి చూపు లేదు ఇంటిలోనే ఉంటూ పక్కింటి వారు ఇతరులు అందించిన ఆహార పదార్థాలతోనే తన ఆకలిని తీర్చుకుంటూ బతుకు జీవనం సాగిస్తున్నది. ఈ విషయాన్ని తెలియజేసిన కనకం తిరుపతి, తేలుకుంట కనకం తిరుపతిలాలపల్లి సూచన మేరకు కనకం కుటుంబం వ్యవస్థాపక అధ్యక్షులు కనకం రమణయ్య స్పందించి స్వయంగా వచ్చి బక్కవ పరిస్థితిని గమనించి వెంటనే రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని తేలుకుంట తిరుపతికి ఆమె బాగోగులు చూసుకోవాలని అధ్యక్షులు కనకం రమణయ్య అందజేశారు. ఆర్థిక సాయం అందించిన కనకం రమణయ్యకి కనకం కనకయ్య, తిరుపతి, సమ్మయ్య, సుధాకర్, విజయ్, తిరుపతి, శ్రీనివాస్, రాయమల్లు, కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

# జోగిపేటలో సన్న బియ్యం పంపిణీ నీ ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

**కరపత్రం సంగారెడ్డి ప్రతినిధి**

రాష్ట్ర ఆహార భద్రత పథకంలో భాగంగా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా ఆందోల్-జోగిపేట కేంద్రంలోని మార్కెట్ గంజ్ లో సన్న బియ్యం పంపిణీ ప్రారంభోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ తో కలిసి లబ్ధిదారులకు సన్న బియ్యంను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మక నిర్ణయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి రేషన్ కార్డులను, ఇందిరమ్మ ఇండ్లను, ఇండ్ల స్థలాలను అందజేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 కోట్ల 85 లక్షల మంది లబ్ధిదారులకు ఒక కోటి 81 లక్షల 696 మెట్రిక్ టన్నుల సన్న బియాన్ని ప్రతి కుటుంబంలోని సభ్యులకి 6 కిలోల చొప్పున ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.



జిల్లాలోని 846 చౌక ధరల దుకాణాల ద్వారా 3లక్షల 78, 728 తెల్ల రేషన్ కార్డులు, అందులో 26, వేల 115 అంత్యోదయ కార్డులు, 100 అన్నపూర్ణ కార్డుల ద్వారా 12 లక్షల 32,274 మంది సభ్యులకు సన్న బియ్యం పంపిణీ ద్వారా లబ్ధి చేకూరుతుందని మంత్రి వెల్లడించారు.సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ ఆహార భద్రత కార్డులోని ప్రతి ఒక్క కుటుంబ సభ్యులకి ఆరు కిలోల చొప్పున, అంత్యోదయ కార్డు ఒక్కంటికి 35 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డు ఒక్కంటికి 10 కిలోల చొప్పున ఉచితంగా సన్నబియ్యం



పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులందరికి నాణ్యమైన బియ్యాన్ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు రెవెన్యూ కలెక్టర్ మాధురి, ఆర్డీవో పాండు, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, అంబదాసు, మాజీ కౌన్సిలర్లు చిట్టిబాబు, సురేందర్ గౌడ్, రంగ సురేష్, పిట్ల లక్ష్మణ్, పట్లోళ్ల ప్రవీణ్, డిజె వెంకటేశం, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

-రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**కరపత్రం సంగారెడ్డి ప్రతినిధి**




భూమికోసం, భుక్తి కోసం, వేట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి అమరుడైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.దొడ్డి కొమురయ్య 98వ జయంతి సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా కురుమ, యాదవ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# సిరిసెడు గ్రామంలో. యువరైతు ఆత్మహత్య

**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 3**



ఇళ్లందకుంట మండలం కి చెందిన వంగ మధు,s/o సమ్మయ్య వయసు 28,తన చిన్న తనం లో తల్లి తండ్రులని కోల్పోయినాడు , ఐలమ్మ వద్దా 3 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంట వేసినాడు కానీ ఆశించినంత దిగుబడి రాలేదు , యాసంగి లో మొక్కజొన్న పంట వేయగ ఆశించినంత దిగుబడి రాదేమో , పెట్టుబడి కోసం తీసుకున్న 4 లక్షల అప్పు తీర్చనేమో అని మనస్తాపం చెంది తేది 30-03-2025 ఆదివారం రోజున సుమారు సాయింత్రం 6 :00 ఆత్మహత్య చేసుకోవడం జరిగినది జమ్మికుంట లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా మెరుగైన విద్యం కోసం ఏకశిల ప్రైవేట్ ఆసుపత్రి హనమకొండ నుండి వరంగల్ లోని ఎం.జి.ఎం కి 02-04-2025 రోజున తరలించగా అదే రోజు సుమారు 5:45 నిమిషాలకి మృతి చెందాడని అతని అన్న వంగ రజనీకర్ ఫిర్యాదు మేరకు ఇల్లందకుంట ఎస్సై రాజకుమార్ దర్యాప్తు చేయడం జరిగినది

# హెచ్ సి యు అడవి తొలగింపు కు నిరసనగా ఓరుగల్లులో ఓ డబ్ల్యు ఎల్ ఎస్ ఎన్జీవో రౌండ్ టేబుల్ సమావేశం

**కరపత్రం ప్రతినిధి ఏప్రిల్ 3**

యూనివర్సిటీ అఫ్ హైదరాబాద్ హెచ్ సి యు 400 ఎకరాల భూముల్లోని అడవులు తొలగిస్తూ అక్రమంగా విద్యార్థుల పర్యావరణ ప్రేమికుల ముందస్తు అరెస్టులను నిరసిస్తూ "ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ (ఓ డబ్ల్యూ ఎల్ ఎస్ ఎన్ జి ఓ), వరంగల్", ఉదయం గ. 9:30 ని. లకు, హరిత కాకతీయ హోటల్, హన్మకొండలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నది. ఈసందర్బంగా అక్కడి పరిస్థితులను,




జరుగుతున్న పరిణామాలను, నాశనంచేస్తున్న జీవవైవిధ్యాన్ని పవర్పాయింట్ ప్రెసెంటేషన్ ఇవ్వనున్నది. ఆసక్తిగల స్వచ్ఛంద సంస్థలు, ప్రజాస్వామిక వాదులు, సామజికవేత్తలు, పర్యావరణవేత్తలు, వృక్ష, జంతు, పర్యావరణ ప్రేమికులు, విద్యార్థులు, మరియు ఆసక్తి గల ప్రజలు పాల్గొనవచ్చునని ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ ఫౌండర్- ప్రెసిడెంట్ ఇందారం నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం ఏప్రిల్ 04 2025

# పదోన్నతిపై బదిలి అవుతున్న ఓసీ1 అధికారులకు ఆత్మీయ వీడ్కోలు సన్మానం

- నా జీవితకాలం మర్చిపోలేని గని -ఉదయ్ హరిజన్
- క్రమశిక్షణ గల గని నుండి ఎంతో నేర్చుకున్నాను -పేరాల శ్రీనివాసరావు
- నాకు కూడా సహకరించండి -మేనేజర్ దురిశెట్టి రమేష్
- ఎస్ఓపిలకు అనుగుణంగా పనిచేయండి -పిఓ రాజశేఖర్



**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 03.**
ఆర్జీ3 ఓసి1 గనిలో పనిచేస్తు పదోన్నతిపై బదిలీ అవుతున్న అధికారులను ఘనంగా సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికిన గని ఉద్యోగులు. ఓసీ1 సైట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సింగరేణి సంస్థ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారంగా ఆర్జి2 ఓసిపి3 ప్రాజెక్ట్ అధికారిగా ఓసీ1 మేనేజర్ ఉదయ్ హరిజన్ మరియు ఎల్లందు ఏరియా కోయగూడెం ఓసి2 మేనేజరుగా గని రక్షణాధికారి పేరాల శ్రీనివాసరావు పదోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా గని ఉద్యోగులు ఆత్మీయ సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే గని మేనేజరుగా ఆర్జీ1 జీడీకే1 ఇంక్లైన్ బావి నుండి బదిలీపై వచ్చిన దురిశెట్టి రమేష్ ను పూల బొకేతో స్వాగతిస్తూ ముగ్గురు అధికారులను ఒకే వేదికలో శాలువాలు, కండువాలు, టవల్లతో పలు సెక్షనుల ఉద్యోగులతోపాటు, అధికారుల సంఘం, ప్రాతినిధ్య, గుర్తింపు యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించి మాట్లాడారు. ప్రాజెక్టు అధికారిగా వెళుతున్న ఉదయ్ హరిజన్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఏడు సంవత్సరాలు మేనేజరుగా పని చేసే అవకాశం ఇచ్చిన గని ఉద్యోగులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి సంవత్సరం వార్షిక లక్ష్యం చేధించి, ఆన్యువల్ సేఫ్టీ కాంపిటీషన్లో ఉత్తమ గనిగా ఎంపిక అయ్యేటట్లు, కేంద్ర ప్రభుత్వంచే ఫైవ్ స్టార్ రేటింగ్ గనిగా ఎంపిక అవ్వడానికి పనిచేసి పేరు తెచ్చి నా జీవిత కాలం మర్చిపోలేని తృప్తినిచ్చిన ఉద్యోగులందరికీ రుణపడి ఉంటానని, ఓసీ1 గని ఉద్యోగులతో నాకు సొంత ఇంటి ఫీలింగ్ ఉందని సంతోషకరమైన మాటలను వ్యక్తం చేశారు. రక్షణ అధికారిగా పనిచేసిన పేరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడు మాసాల పాటు పనిచేసి ఓసి1 గని నుండి ఎంతో నేర్చుకోవడం జరిగిందని సింగరేణిలో ఓసి1 క్రమశిక్షణ గని అన్నారు. నూతన మేనేజరుగా బాధ్యతలు చేపట్టిన దురిశెట్టి రమేష్ మాట్లాడుతూ గత అధికారులకు సహకరించి పేరు తెచ్చి వార్షిక లక్ష్యాన్ని రక్షణతో సాధించుటకు అందరూ సహకరించాలని కోరారు. గని ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులందరూ రక్షతో పనిచేస్తూ ఎస్ఓపిల ప్రకారంగా నడుచుకుంటూ ఎప్పటిలాగానే నూతన మేనేజర్ సహకరించి ఉత్పత్తికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అధికారుల సంఘం ప్రతినిధి ఎల్ వినాయక్, ఐఎన్టియూసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్, గని ఐఎన్టియుసి పిట్ కార్యదర్శి వెంకట్ స్వామి గౌడ్, ఎఐటియూసి పిట్ కార్యదర్శి దుగ్యాల తిరుపతిరావు, సంక్షేమ అధికారి సాయికృష్ణ గని ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన వాణి సోడా ఫ్యాక్టరీ ప్రారంభించిన దుద్దిళ్ళ శ్రీను బాబు

**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 03.**





గురువారం రామగిరి మండలంలోని రత్నాపూర్ (బేగంపేట్ ఎక్స్ రోడ్ గ్రామానికి చెందిన) యూత్ కాంగ్రెస్ నాయకులు, వాణి సోడా ఫ్యాక్టరీ నిర్వాహకులు బండారి శివ, గిరవేన ప్రవీణ్,పాశం సాయి "వాణి సోడా ఫ్యాక్టరీ" ని ప్రారంభించి శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు, నిర్వాహకులు బండారి శివ, గిరవేన ప్రవీణ్,పాశం సాయి కి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్,రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షులు రొడ్డ బాపన్న మరియు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యాలను సాధించాం

- ఆర్.జి-3 జి.యం



సమిష్టి కృషితోనే ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించామని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు గాను గురువారం ఓ.సి.పి-2 ఉపరితల గని లో ఏర్పాటు చేసిన అభినందన సభకు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాజమాన్యం రామగుండం-3 ఏరియాకు నిర్దేశించిన 62.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 104 శాతంతో 65.11 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడంలో భాగంగా ఓ.సి.పి-2 ఉపరితల గనికి నిర్దేశించిన 27.50 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 30.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినందుకు సంబంధిత అధికారులకు, ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. సింగరేణి సంస్థకు అద్భుతమైన నాయకత్వంతో చక్కని మార్గదర్శకత్వం అందిస్తున్న సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ గారికి, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్న డైరెక్టర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే సంస్థలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులకు, కార్మిక సంఘాల నాయకులకు, ప్రభుత్వ విభాగాల ఉన్నతాధికారులకు, స్థానిక ప్రజా ప్రతినిధులకు, పరిసర ప్రాంతాల ప్రజలకు, కాంట్రాక్టర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా ఈ లక్ష్య సాధనలో ఎప్పటికప్పుడూ తగిన సహాయ సహకారాలను అందిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఉద్యోగులందరూ భవిష్యత్తులో ఇదే ఒరవడిని కొనసాగిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను సమిష్టి కృషితో, భద్రతతో సాధిస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని, అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రారెడ్డి, కోట రవీందర్ రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్ సి.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, మేనేజర్ కె.వి.రామారావు, పిట్ సెక్రటరీలు వెంకటస్వామి, రామిండ్ల మనోహర్, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు నోట్ బుక్స్ పెన్స్ పంపిణీ...




**కరపత్రం శంకరపట్నం ఏప్రిల్ 3**
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు నోట్ బుక్స్ పెన్స్ వాటర్ బాటిల్ లను అందజేసినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎం లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ లక్ష్మీనారాయణ మాట్లాడారు కలెక్టర్ పమేల సత్పతి ఆదేశాల మేరకు శంకరపట్నం మండలంలోని వర్క్ సైట్ స్కూల్ పిల్లలకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిల్స్, పెన్సిల్స్, నోట్ బుక్స్, మధ్యాహ్నం భోజన ప్లేట్స్ఇతర సామాగ్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బి.సుభాష్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు , ఉపాధ్యాయులు, సిఆర్పిలు, ఎంఆర్పీ ,సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## సొమ్ము కేంద్రానిది సోకు రాష్ట్రానిదా...

- మట్ట పవన్ రెడ్డి
- బీజేపీ సీనియర్ నాయకుడు



**కరపత్రం ప్రతినిధి ఇల్లందకుంట ఏప్రిల్ 3**
ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కరోనా సమయం నుండి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా 5 కిలోల బియ్యాన్ని ప్రతినెలా ఇవ్వడం జరుగుతుందని,రాబోయే 5 సంవత్సరాల వరకు కూడా ఉచితంగా 5 కిలోల బియ్యాన్ని ఇస్తామని నరేంద్ర మోడి ప్రభుత్వం చెప్పడం జరిగిందని పవన్ రెడ్డి గుర్తు చేశారు ఇల్లందకుంట మండలంలోని కనగర్తి గ్రామంలో రేషన్ షాపు ను మండల ఆధ్యక్షుడు బైరెడ్డి రమణా రెడ్డి మరియు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా పవన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ కేంద్రం ఇచ్చే 5 కిలోల బియ్యానికి 1కిలో బియ్యం కలిపి ఇచ్చి మొత్తం వాళ్ళే ఇచ్చినట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని పవన్ రెడ్డి మండిపడ్డారు. ఎ న్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వైఫల్యం చెందిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, చెప్పుకోవడానికి చేసింది ఏమిలేక రాష్ట్ర ప్రజల దృష్టిని మరల్చడం కోసం 6 కిలోల సన్న బియ్యం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని చెప్పి కాంగ్రెస్ నాయకులు రేషన్ షాపుల కాడికి పోయి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని పవన్ రెడ్డి ఆరోపించారు. దమ్ముంటే కాంగ్రెస్ నాయకులు ఉచిత బియ్యం పంపిణీలో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఎంతో తెలుపాలని సవాలు విసిరారు. కాంగ్రెస్ నాయకుల వ్యవహారశైలి సొమ్మొక్కడిది, సోకొక్కడిది లాగా వుందని చురకంటించారు. ఇప్పటి కైన కాంగ్రెస్ నాయకు అబద్ధపు ప్రచారాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు కొరకు కృషి చేయాలని పవన్ రెడ్డి సూచించారు. లేనట్లయితే రాబోయే రోజుల్లో ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పవన్ రెడ్డి తోపాటు మండల బీజేపీ అధ్యక్షుడు బైరెడ్డి రమణా రెడ్డి,నాయకులు ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి,అబ్బిడి తిరుపతిరెడ్డి వట్టపల్లి సంజీవ్, రామంచ సంపత్ మట్ట నారాయణరెడ్డి కొక్కుల దేవేందర్ బుర్ర మల్లయ్య వట్టపల్లి శరత్ చంద్ర బ్రహ్మానందం కుమార్ తదితరులు పాల్గొన్నారు

## లొంకకేసారం అభివృద్ధికై మంత్రిని కలిసిన గ్రామ శాఖ అధ్యక్షుడు వీర గొని శ్రీనివాస్



**కరపత్రం రామగిరి ప్రతినిధి, ఏప్రిల్ 03.**
గురువారం లొంకకేసారం గ్రామ అభివృద్ధి కొరకై తెలంగాణ ఐ.టి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను లొంకకేసారం గ్రామశాఖ అధ్యక్షులు వీరగోని శ్రీనివాస్ గౌడ్ ఆద్వర్యంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.రోడ్లు, ఆర్వో వాటర్ ప్లాంట్ మరియు సోలార్ విద్యుత్ దీపాల తో మా గ్రామాన్ని రోల్ మోడల్ విలేజ్ గా అభివృద్ధి పథంలో మంత్రి యొక్క ప్రత్యేక చొరవతో మా గ్రామాన్ని అభివృద్ధి దిశగా అడుగులు వేసెల కృషి చేయాలని కోరడం జరిగినది.ఇందులో భాగంగా గ్రామ శాఖ అధ్యక్షులు వీరగోని శ్రీనివాస్ గౌడ్,డాక్టర్ సందీప్,రమేష్ కన్న పాల్గొన్నారు.

## పేదవాడి కడుపు నింపడానికై సన్నబియ్యం పథకం.

- సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ టాప్.



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 3**
జమ్మికుంట మండల పరిధిలోని మాచనపల్లి గ్రామంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు ఉచిత సన్న బియ్యం పథకాన్ని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు.అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయే విధంగా సన్నబియ్యం పథకాన్ని రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్ నగర్ వేదికగా ప్రారంభించారని, ప్రతి రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందజేస్తామని అన్నారు.పేదల కోసం ఏ ప్రభుత్వం చేయని మంచి పనిని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మాత్రమే చేశామని అన్నారు.మన దగ్గర పండిన పంటను ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేయడం శుభసూచకమని,భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని అన్నారు. బీజేపీ ఎంపీ లు ప్రభుత్వం పైన, సన్న బియ్యం పంపిణీ గురించి తప్పుడు మాటలు మానుకుని దమ్ముంటే బీజేపీ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాచనపల్లి గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేల్పుల ప్రశాంత్, ఓరుగంటి రవీందర్ రావు, గుడిపాటి సత్యనారాయణ రెడ్డి, ఉమ్మడి సందీప్,కావటి తిరుపతి, జంగం నాగరాజు, బోలవేనా సంపత్, బోలవేనా సారయ్య, పర్లపల్లి అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.